వంతెనెక్కితే వడ్డనే!

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనాల ప్రవేశానికి చెక్

- హెచ్ఎండీఏతో కలిసి ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- సీసీ కెమెరాలతో నిఘా
- బ్రిడ్జి ఎక్కితే అపరాధ రుసుం విధింపు



ఆదివారం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై వెళ్తున్న ద్విచక్ర వాహనం

రాజేంద్రనగర్: నిబంధనలకు వ్యతిరేకంగా పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పై ద్విచక్ర వాహనదారులు ప్రయాణించకుండా ఉండేందుకు హెచ్ఎండీఏతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. సరోజినీదేవి ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 11 కిలో మీటర్ల మేర నిర్మించిన పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ద్విచక్ర వాహనాదారులు, భారీ వాహనాలకు అనుమతి లేదన్నారు. కానీ కొందరు ద్విచక్ర వాహనాదారులు ఈ వంతెనపై నుంచి ప్రయాణిస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు.

- గతంలో ఈ వంతెనపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందిన ఘటనలు సైతం జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో పీవీఎస్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ద్విచక్ర వాహనదారుల ప్రవేశాన్ని అరికట్టేందుకు హెచ్ఎండీఏతో పలు మార్లు సంప్రదింపులు జరిపి తగు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.
- ఎక్స్‌ప్రెస్‌వే వంతెనపై ఎక్కేందుకు, దిగేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.
- ఈ నెల చివరి నాటికి ఈ పనులు పూర్తి అవుతాయన్నారు. సీసీ కెమెరాల ద్వారా వాహనాదారులను గుర్తించి అపరాధ రుసుం వేస్తామన్నారు.
- సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు పోలీస్‌స్టేషన్‌లోనే తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫ్లై ఓవర్ ర్యాంపుల వద్ద సీసీ కెమెరా వాహనాన్ని గుర్తించి అపరాధ రుసుం విధించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. దుర్గానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుమ్మరి సొసైటీ సభ్యులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ కుమ్మరి బస్తీలో అత్తాపూర్ కుమ్మరి సొసైటీ ఆధ్వర్యంలో కవయిత్రి ఆకునూరి మొల్లమాంబ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయుల కాలంలో తొలి తెలుగు కవయిత్రిగా మొల్లమాంబ గుర్తింపు పొందారన్నారు. వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో సరళ శైలిలో కేవలం ఐదు రోజుల్లో అనువదించిన మహా ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు యాదయ్య, లక్ష్మీనారాయణ, శంకర్, కృష్ణ, సతీష్, రవి, రమేష్, అనిల్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ వర్సిటీ పీఆర్ఓకు ఓయూ డాక్టరేట్



పీఆర్ఓ సుధాకర్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పీఆర్ఓ వి.సుధాకర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'రాష్ట్రంలో నూతన వంగడాలు, వ్యవసాయ పరిజ్ఞానం', 'తెలంగాణ సోన వరి రకం ప్రచారంలో ప్రసార మాధ్యమాల పాత్ర– కమ్యూనికేషన్ సవాళ్లు' అన్న అంశంపై ఉస్మా నియా విశ్వవిద్యాలయంలోని జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో సుధాకర్ పరిశోధన చేశారు. ఓయూ నుంచి డాక్టరేట్ సాధించిన సుధాకర్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, ఇతర అధికారులు అభినందించారు.

నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



జలమండలి మేనేజర్ రాజా నరేందర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన జలమండలి మేనేజర్ రాజా నరేందర్‌తో సమావేశమై డివిజన్‌లో నెలకొన్న మంచినీటి సమస్యలపై చర్చించారు. లోప్రెషర్, నీటి సరఫరా తదితర వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ సాగర్‌గౌడ్ మాట్లాడుతూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. తమవంతు బాధ్యతగా నీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ స్తంభం తొలగింపు

రాజేంద్రనగర్: ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు బుద్వేల్ ప్రధాన రహదారి మధ్యంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని సోమవారం తొలగించారు. నాలుగేళ్ల క్రితం రహదారి వెడల్పులో భాగంగా విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలోకి వచ్చింది. ఈ స్తంభాన్ని తొలగించాలని వాహనాదారులు, స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. వివిధ కారణాలు చూపుతూ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. ఎట్టకేలకు సోమవారం స్తంభాన్ని తొలగించి రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు నరేష్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

- ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాజేంద్రనగర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య, ఇతర విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో వేలాది మంది పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎ.సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి టీ.ఆనంద్, మండల కోశాధికారి ఎ.రాజు, మండల నాయకులు పెంటయ్య, మోహన్, సామేలు, శ్రీను, నరహరి, రాజేష్, ప్రేమిల, సంతోష్, సరస్వతి, లక్ష్మమ్మ, పుష్పమ్మ, ఎల్లమ్మ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- నార్సింగి కేంద్రంలో 521 ఓట్లకు 459 ఓట్లు పోలింగ్



నార్సింగిలో ఓటు హక్కు వినియోగించుకున్న అధ్యాపకులు

మణికొండ: ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉన్న 521 ఓట్లకు నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న ఓటర్లు నార్సింగికి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 110 ఓట్లు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 49, బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో 362 ఓట్లు ఉన్నాయి. వాటిలో 459 ఓట్లు.. అంటే 88.43 శాతం పోలైనట్టు అధికారులు తెలిపారు.

రాజేంద్రనగర్‌లో....

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 343 ఓటర్లు ఉండగా, వీరిలో 287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా రాజేంద్రనగర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాన్ని రాజేంద్రనగర్ డీసీపీ, ఏసీపీ పరిశీలించారు.



ఓటు వేసి సిరా చుక్క చూపిస్తున్న ఉపాధ్యాయులు

సిద్ధాంతి వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మించండి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



కేంద్ర రవాణా శాఖ డైరెక్టర్ జనరల్ రవిప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి సిద్ధాంతి వద్ద మరో ఫ్లైఓవర్ ఏర్పాటు అవశ్యకతను చేవెళ్ల నియోజకవర్గ ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్ర రవాణా శాఖ డైరెక్టర్ జనరల్ రవి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయనతో సమావేశమైన ఎంపీ.. సిద్ధాంతి వద్ద ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి అక్కడితో ఆగిపోవడం వల్ల తీవ్ర సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం అక్కడ ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని తెలిపారు. దీనిపై స్థానికుల నుంచి తీవ్ర నిరసనలు కూడా వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జికి కొద్ది దూరంలోనే మరో బ్రిడ్జి ఏర్పాటు చేసి అండర్ పాస్ కల్పిస్తే సిద్ధాంతితో పాటు శంషాబాద్ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. ఇదే విషయంపై ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీకి విన్నవించానని ఆయన గుర్తు చేశారు. మరో మారు కేంద్రమంత్రితో కలిసి ఈ విషయమై మాట్లాడనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రావణ్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ జాగృతి కన్వీనర్ రగడంపల్లి శ్రావణ్ ఆధ్వర్యంలో బుద్వేల్‌లోని సెయింట్ అల్ఫోన్సా కరుణాలయంలో కవిత జన్మదినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉంటున్న వారికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, సీనియర్ నాయకులు పోయిల జీవన్‌దాస్, విజయ్‌కుమార్, అనుముల జాన్‌పాల్, నందిగామ నర్సింహ, శ్రీవర్ధన్‌రెడ్డి, నరేష్‌యాదవ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

రాజేంద్రనగర్: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అత్తాపూర్ భాష్యం పాఠశాల సీఈఓ చైతన్య, జెడ్ఈఓ అంకమ్మరావు అన్నారు. అత్తాపూర్ భాష్యం పాఠశాల 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ ఆర్.నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆయూబ్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ లౌక్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగింది. పూజా కార్యక్రమంలో సినీనటుడు మురళీమోహన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న సినీనటుడు మురళీమోహన్ తదితరులు

క్రైం కార్నర్..

బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

- మరో యువకుడికి తీవ్రగాయాలు

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఓల్డ్ కర్నూల్ రోడ్డు రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడిని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకుడు తన పేరు జుబేర్‌ఖాన్, తీగలకుంట ప్రాంతంలో ఉంటానని పోలీసులకు చెప్పాడు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలపలేదని, ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనీఆలం ప్రాంతానికి చెందిన అస్లాం(22) ఈ నెల 9న పీడీపీ చౌరస్తా ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అమీర్ (ఫైల్)

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ ఎంఎం పహాడీ ప్రాంతానికి చెందిన అమీర్(38) భార్యతో కలిసి ఉంటున్నాడు. నగరంలోని ఓ దుకాణంలో గ్లాస్ ప్లంబింగ్ పని చేస్తున్నాడు. వారం క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మూడు రోజులుగా అమీర్ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు వెళ్లి పరిశీలించగా అప్పటికే అమీర్ మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియాకు తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య ఇతర కుటుంబ సభ్యులు వస్తే అతడి మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గణేష్‌నగర్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించగా, అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటాయని, అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద లేదా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛత అవార్డుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో 18 ఏళ్ల వయసు దాటిన మహిళలకు త్వరలో ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు–2023 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. ఇందులో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మహిళలు, డ్వాక్రా గ్రూప్‌లు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే మహిళలు ఇందులో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సంపత్‌కుమార్‌ను నం.9949157957పై సంప్రదించాలన్నారు.

జ్యువెలరీ షాప్‌లో ఐటీ దాడులు

శంషాబాద్: వివిధ జిల్లాల్లోని శ్రీ వెంకటరమణ జ్యువెలర్స్ దుకాణాలపై సోమవారం జరిగిన దాడుల్లో భాగంగా శంషాబాద్ పట్టణంలోని శ్రీ వెంకటరమణ జువెలర్స్ దుకాణంలో కూడా ఐటీ అధికారులు సోదాలు జరిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కూడా సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి.ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నటు సమాచారం.

బ్యాంకుల్లో మహిళా దినోత్సవ వారోత్సవాలు



కెనరా బ్యాంక్‌లో మహిళా గ్రూప్ సభ్యులకు రుణ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా బ్యాంకుల్లో మహిళా గ్రూప్‌లు, సెప్, స్ట్రీట్ వెండర్స్‌కు సన్మానం, రుణాల చెక్కుల పంపిణీ వంటివి చేశారు. ఎస్‌బీఐ శివరాంపల్లి బ్రాంచ్‌లో వెండర్స్‌కు రూ. 50 వేల చెక్కు అందజేసి సన్మానించారు. రాజేంద్రనగర్‌లోని కెనరా బ్యాంక్‌లో మహిళా సంఘాలకు రూ. 15 లక్షల రుణ మంజూరు పత్రాలు, ఎస్ క్యాబ్ రాజేంద్రనగర్ బ్రాంచ్‌లో సెప్ లబ్ధిదారులకు రూ. లక్షల చెక్కు అందజేసి సన్మానించారు. కార్యక్రమాల్లో డీపీఓ రాధారాణి, సీవోస్ లక్ష్మణ్, విజయేంద్ర విజయ్, ఉపేందర్, రేణుక, ఆర్‌పీలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

బండ్లగూడ: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లోని రాక్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు.

ఈ నెలలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో హన్నా, శివాణి, కల్యాణి, ఈశ్వర్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు బిలై, ఛత్తీసగఢ్‌లో సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ జైన్, పీఈటీ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రాజు, శివ, స్వర్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీతారాంకు బీఆర్ఎస్ నాయకుల అభినందనలు



సీతారాంను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా 3వ సారి ఏకగ్రీవం ఎన్నికైన సీతారాంను బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయనతో పాటు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బి. శ్రీరాములు ఆధ్వర్యంలో సీతారాంను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీల్లో సమస్యల పరిష్కారానికి ఆల్ కాలనీస్ ఫెడరేషన్ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, శ్రావణ్‌కుమార్, రామసుబ్బారెడ్డి, శ్రీకాంత్, కిరణ్, విజయలక్ష్మి, శివగంగ, సురేఖలతో పాటు తిరుమలహిల్స్ కాలనీకి చెందిన డాక్టర్ అవినాష్ అధ్యక్షుడు సీతారాంతో పాటు ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులును సన్మానించారు.

పెద్దషాపూర్ పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం రాజేంద్రనగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన సందర్శించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ స్కీంలో పెద్దషాపూర్ పీహెచ్‌సీ ఎంపికైనట్టు ఆమె తెలిపారు. ఆస్పత్రి మౌలిక వసతుల కల్పనకు రూ.లక్ష మంజూరైనట్టు చెప్పారు. ఈ నిధులతో పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ స్కీం ద్వారా ప్రతి ఏటా ఆస్పత్రికి కేంద్రం నుంచి అదనంగా నిధులు వస్తాయన్నారు.

అత్యవసర సేవలు అందించాలి: ఎంపీటీసీ

పెద్దషాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఎంపీటీసీ సభ్యుడు చెక్కల ఎల్లయ్య డిప్యూటీ డీఎంహెచ్ఓకు విన్నవించారు. ఇటీవల ఆస్పత్రిలో ప్రసూతి సేవలు మెరుగు పడ్డాయని, చుట్టు పక్కల గ్రామాల వారికి అత్యవసర సమయంలో ప్రాథమిక వైద్యం అందేలా ఇక్కడ 24 గంటల వైద్య సేవలు చేపట్టాలన్నారు. ఈ విషయమై ఇది వరకే ప్రతిపాదనలు పంపినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చుక్క ప్రభాకర్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎంఓ రవీందర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ ఎండీ.మునావర్‌హుస్సేన్, ఎంపీహెచ్ఎస్ విద్యులత, సిబ్బంది పాల్గొన్నారు.